తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల
పెద్దపల్లి | జగిత్యాల
కామారెడ్డి
ఆదివారం
10 మే 2026
పేజీలు : 8

# ధాన్యం అన్ లోడింగ్‌ను రెట్టింపు వేగంతో పూర్తి చేయాలి:కలెక్టర్



- ○ రైస్ మిల్లుల్లో హమాలీల సంఖ్యను వెంటనే పెంచాలని ఆదేశం
- ○ ట్యాబ్ ఎంట్రీలు 100 శాతం పూర్తి చేసి రైతులకు త్వరితగతిన చెల్లింపులు చేయాలి
- ○ వర్షాల నేపథ్యంలో ధాన్యం రక్షణకు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలి
- ○ జిల్లాలోని రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**సుల్తానాబాద్,మే 09(జనంసాక్షి) :**
జిల్లాలో ధాన్యం అన్ లోడింగ్‌ను రెట్టింపు వేగంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత కలెక్టరేట్ సమీపంలోని అన్నపూర్ణ రైస్ మిల్, పెద్ద కాల్వల వద్ద ఉన్న రాధాకృష్ణ రైస్ మిల్, సుల్తానాబాద్ మండలంలోని కదంబాపూర్ గ్రామ సాయి తేజ రైస్ మిల్, పూసాల గ్రామంలోని కళ్యాణి రైస్ మిల్, కాట్నపల్లి గ్రామంలోని గౌరీనాథ్ రైస్ మిల్, మమతా రైస్ మిల్, సదాలక్ష్మి రైస్ మిల్, లక్ష్మీ గణపతి రైస్ మిల్, అలాగే పూసాల గ్రామంలోని పరమేశ్వర రైస్ మిల్లులను సందర్శించి ధాన్యం అన్‌లోడింగ్, నిల్వలు, ట్యాబ్ ఎంట్రీలు, ట్రక్ షీట్ల జనరేషన్ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రైస్ మిల్లుల వద్ద హమాలీల సంఖ్యను వెంటనే పెంచి అన్‌లోడింగ్ ప్రక్రియను రెట్టింపు వేగంతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుండి నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే రైస్ మిల్లులకు తరలిస్తున్న నేపథ్యంలో మిల్లుల వద్ద ఎటువంటి ధాన్యం కోతలు విధించరాదని స్పష్టం చేశారు. ట్రక్ షీట్లు వెంటనే జనరేట్ చేయాలని, ట్యాబ్ ఎంట్రీలు 100 శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు సంబంధించిన చెల్లింపులు త్వరితగతిన వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే ఏడు రోజులలో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ధాన్యం తడవకుండా అన్ని రైస్ మిల్లులు, కొనుగోలు కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు సమృద్ధిగా నిల్వ ఉంచాలని, అవసరమైన రవాణా వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఈ తనిఖీలలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్ నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు అందని టార్పాలిన్లు

- ○ పొంచి ఉన్న ఆకాల వర్షాల ముప్పు
- ○ ఆరేళ్లుగా అందని సబ్సిడీ టార్పిలిన్లు...
- ○ ఆందోళనలో అన్నదాతలు

**కోనరావుపేట(జనంసాక్షి):**



యాసంగి వరి కోతలు ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు నత్త నడకన కొనుగోలు చేస్తున్నారు. చాలా మంది రైతులు తమ పొలాలు కోసుకుని ధాన్యం ను ఎండబెట్టుకుంటున్నారు . వాతావరణంలో మార్పు వచ్చింది. అకాల వర్షాలు కురుస్తున్నాయి. రైతుల వద్ద టార్పల్లిన్ లు లేక దాన్యం కాపాడుకోవడం ఎలా అని ఆందోళన చెందుతున్నాడు. ఆరేళ్ల క్రితం వరకు ప్రభుత్వం టర్పాలిన్లను రాయితీ పై రైతులకు అందజేసినారు అనంతరం నిలిపివేసింది. అవసరమున్న రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద టార్పాలిన్తెచ్చుకుంటున్నారు. కొందరు అద్దెకు తెచ్చుకుంటున్నారు సన్న కారు రైతులు మాత్రం నానా ఇబ్బందులు పడుతున్నారు ఎక్కువ ధరలతో టార్పిండ్లు తెచ్చుకుంటే పెట్టుబడులకు కూడా కష్టమవుతుందని యాసంగిలో నైనాటార్పాలిన్లు రాయితీపై అందివ్వలని అన్నదాతలు కోరుతున్నారు. కేంద్ర ప్రభు త్వం రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం కింద 50శాతం రాయితీతో గతంలో టార్పాలిన్లను అంద జేసింది. ధర 2500 రూపాయలు ఉంటే 50 శాతం పచ్చిడితో 1250 రూపాయలకు రైతులకు అందించేంది. తర్వాత ఈ పథకాన్ని వ్యవసాయ శాఖకే పరిమితం చేశాడు. చివరిగా 2018లో వీటినిపంపిణీ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రాయితీపై ఇవ్వడం లేదు ప్రైవేటు వ్యాపారుల వద్ద రైతులు టార్పాలిన్లు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఒక్కో టార్పాలిన్కు నాలుగు వేల వరకు ఖర్చు చేయడం రైతులకు భారంగా మారింది. పంటను కాపాడుకోవడానికి పరదాలను అద్దెకు తెచ్చుకుంటున్నారు. ఒక్కోదానికి రోజు కు 10 నుంచి 15 రూపాయల వరకు అద్దె ఇస్తున్నారు. సన్నకారు రైతులు అద్దెకి తెచ్చుకుంటున్నారు ప్రభుత్వం ఇకనైనా సబ్సిడీ టార్పిండ్లను అందజేయాలని మండల రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# భూలక్ష్మి, మహాలక్ష్మి, సహిత బొడ్రాయి ప్రతిష్టలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు

మంథని, (జనంసాక్షి) :
పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని సూరయ్యపల్లి గ్రామంలో నిర్వహించిన భూలక్ష్మి, మహాలక్ష్మి ,సహిత బొడ్రాయి స్థిర ప్రతిష్ట, పోచమ్మ కొలుపు కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. గ్రామ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు. గ్రామ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంత్రి శ్రీధర్ బాబు కి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామ ప్రజలు,యువకులు, మహిళా సోదరీమణులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మానవీయ కోణాన్ని ఆవిష్కరించే పాటలు రావాలి

- ○ప్రజల జీవన విధానాలపై, పాలకుల ప్రజా వ్యతిరేక చర్యలపై పాటలు తూటాల్లా పాడాలి
- ○మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపు
- ○రెండు రోజుల కళాకారుల శిక్షణా శిబిరం ప్రారంభం




**కరీంనగర్ టౌన్ , మే 9 (జనంసాక్షి )**
సమాజంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని మానవీయ కోణంలో ఆలోచించే విధంగా పాటలు రావాలని, ప్రజల జీవన ప్రమాణాలు, కష్టసుఖాలను ప్రతిబింబించేలా కళాకారులు రచనలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కళాకారులకు పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో తెలంగాణ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా కళాకారుల రెండు రోజుల శిక్షణా శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారుల గళం, కలం నుంచి ప్రజల చరిత్ర, జీవనశైలి, కష్టసుఖాలు కళ్లకు కట్టినట్లు ప్రతిబింబించే పాటలు, రచనలు రావాలని అన్నారు. నిజాం నిరంకుశపాలన, రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం నింపిన ఉద్యమ గీతాలు చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించాయని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి కూడా కళాకారుల పాటలు, ఆటలు, ప్రదర్శనలు ఊపిరి పోశాయని పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించే పాలకులపై ప్రజలను చైతన్యవంతం చేసే శక్తి పాటలకు ఉందని, అవసరమైనప్పుడు పాట తూటాల్లా మారాలని అన్నారు. కళ కళ కోసం కాదు? ప్రజల కోసం అనే నినాదాన్ని నిజం చేయడానికి ప్రతి కళాకారుడు బాధ్యతతో ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కళాకారులకు పుట్టినిల్లులాంటి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కళారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ శిక్షణా శిబిరం ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, సీపీఐ జిల్లా కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, తాండ్ర సదానందం, మంద సుదర్శన్, ఇప్టా జాతీయ కౌన్సిల్ సభ్యులు కవ్వంపల్లి స్వామి, ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్నం లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి :మంత్రి శ్రీధర్ బాబు

**ముత్తారం మే 09(జనంసాక్షి) :** మహిమ కలిగిన రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు..శనివారం పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టపన మహోత్సవ కార్యక్రమానికి జరిగిన పాల్గొన్నారు.రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకొని నూతన వస్త్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి అంటేనే మహిమ గలదని తప్పకుండా గ్రామ ప్రజలకు రైతులకు ఆ తల్లి దీవెనలతో అందరూ మంచిగా ఉండాలని సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు.తద్వారా అమ్మవారి ఆశీర్వాదం కూడా అందరిపై ఉంచుతూ ఈ ప్రాంత రైతులను క్షేమంగా చూసుకోవాలని అన్నారు.అనంతరం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ,గ్రామ సర్పంచ్ కొట్టె అన్నపూర్ణ ఉపేందర్,పి ఏ సి ఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరి రావు,కమాన్ పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల



రాజయ్య,మాజీ జడ్పిటిసి నాగినేని జగన్ మోహన్ రావు,మాజీ ఎంపిటిసి దొడ్డ గీత రాణి, కాంగ్రేస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు గోవిందుల పద్మ,మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు వాజీద్ పాషా,కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గాధం శ్రీనివాస్,బిసి సెల్ మండల అధ్యక్షుడు అల్లం కుమారస్వామి, యూత్ మండల అధ్యక్షుడు వినీత్,సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బియ్యని శివకుమార్,సర్పంచ్లు మెంగని సమత తిరుపతి,రాపెల్లి రాజయ్య,చిలువేరి జ్యోతి లక్ష్మణ్, చొప్పరి సంపత్,రాజేశం, ఇంద్ల కృష్ణవేణి సదానందం,నాయకులు,నూనెటి కృష్ణ,మండల రమేష్,గోవిందుల ఆనంద్,కొల విజయ్,తాటిపాముల శంకర్,దొంతుల రాకేష్ తోపాటు వార్డు సభ్యులు, వివిధ సంఘాల నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా ఆదివరాహస్వామి కళ్యాణ మహోత్సవం

**మంథని, ( జనంసాక్షి ) :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీ ఆదివరాహస్వామి క్షేత్రం ఆవరణలో శనివారం స్వామి వారి మాస కళ్యాణ మహోత్సవం కార్యక్రమాన్నికన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో



ఆదివరాహస్వామి దేవస్థానం చైర్మన్ ముస్త్యాల దామోదర్, ఆలయ ఈవో కాంతారెడ్డి తో పాటు డైరెక్టర్లు తీగల రాజయ్య, తిమ్మరాజు గిరిజ సంతోష్, బొజ్జ సతీష్, అనవేన శ్యామల సదయ్య, కుందారపు శంకర్ అర్చకులు శ్రీ రామానుజచార్యులు , భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### తూంపల్లిలో పెద్దమ్మ తల్లి వార్షికోత్సవంలో

## పాల్గొన్న బీజేపీ నాయకులు

సిరికొండ, మే 9 (జనం సాక్షి): సిరికొండ మండలం తూంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి గారు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజల సుఖసంతోషాలు, శాంతి సమృద్ధులు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తూంపల్లి గ్రామ సర్పంచ్ జినుక రాజేందర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నక్క రాజేశ్వర్ గారు,



సిరికొండ మండల అధ్యక్షుడు గుర్రపు సంజీవ్ గారు, రాజేశ్వర్ రెడ్డి గారు పాల్గొన్నారు. అలాగే మండల నాయకులు గంగ మురళి, భూస రాజు, చింతకుంట రామస్వామి, దేశ్య నాయక్, బాల్ రాజ్, రవి మోహన్, సాయిలు తదితరులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# మే 15 గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

**కరీంనగర్ టౌన్ , మే 9 ( జనం సాక్షి )** ఉపాధి హామీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, కార్మిక వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న నిర్వహించే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. ప్రసాద్ పిలుపునిచ్చారు. గ్రామీణ బంద్ విజయవంతం కోసం కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరుస్తూ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించే బాధ్యత నుంచి తప్పుకుంటోందని ఆరోపించారు. గత పది రోజులుగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తే అనేక సమస్యలు బయటపడ్డాయని తెలిపారు. పని ప్రదేశాల్లో కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదని, ఎండల తీవ్రతతో కార్మికులు డీహైడ్రేషన్‌కు గురవుతున్నప్పటికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందించడం లేదని విమర్శించారు. అంతేకాకుండా గత రెండు నెలలుగా చేసిన పనులకు వేతనాలు విడుదల కాకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చినా అమలు చేయడం లేదన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం




కొత్త నిబంధనల పేరుతో కేవైసీ, ఫోటో క్యాప్చరింగ్ వంటి విధానాలను తీసుకువచ్చి పేదలను ఉపాధి హామీ పనులకు దూరం చేస్తోందని విమర్శించారు. గతంలో ఉన్న 100 శాతం నిధులను 60 శాతానికి కుదించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పనులు దెబ్బతింటున్నాయని తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం మే 15న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేసి కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు రాయికంటి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి సంపత్, జిల్లా నాయకులు బీసా రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు ఏఐయుకెఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

### సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నేత పి.రామకృష్ణ పిలుపు



సిరికొండ, మే 9 (జనం సాక్షి): అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకెఎస్) ఆధ్వర్యంలో ఇల్లందులో ఈ నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి.రామకృష్ణ పిలుపునిచ్చారు. సిరికొండ మండలంలోని గడ్కోల్ గ్రామంలో శనివారం ఏఐయుకెఎస్ జాతీయ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని విమర్శించారు. పంటల సాగు ఖర్చులు రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, శ్రమకు తగిన ఆదాయం రాక రైతులు అప్పుల పాలై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో కొంతమంది రైతులు సాగును వదిలివేయడం, మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరమని పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగం, కూలీలు, పేద ప్రజలు ఐక్యంగా పోరాటాలు నిర్వహించడం ద్వారానే పాలకుల రైతు వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ దోపిడీని తిప్పికొట్టగలమని ఆయన తెలిపారు. ఇల్లందులో జరగనున్న మహాసభలకు దేశంలోని పలు రాష్ట్రాల రైతు నాయకులు హాజరవుతున్నారని, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొని సంఘటిత శక్తిని చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐయుకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బాబన్న, జిల్లా కార్యదర్శి ఆర్.దామోదర్, జిల్లా కోశాధికారి ఎం.లింబాద్రి, జిల్లా నాయకులు ఎం.నరాగౌడ్, బి.సర్పంచ్ సాయిలు, వెల్డింగ్ రాజు, ఇస్రీ గంగారాం, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ మండల నాయకులు బి.కిశోర్, ఎం.సాయిరెడ్డి, ఎస్.కిశోర్, కె.ఆశిస్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ బంద్ విజయవంతం చేసిన ప్రజలకు బీఆర్ఎస్ కృతజ్ఞతలు

### ప్రజల మద్దతుతో బంద్ సక్సెస్ అయిందన్న చల్ల హరిశంకర్

**కరీంనగర్ టౌన్ , మే 9 ( జనం సాక్షి)** కరీంనగర్ నగర బంద్‌ను విజయవంతం చేసిన ప్రజలకు, బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామని కరీంనగర్ నగర బీఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన బంద్‌కు కరీంనగర్ ప్రజలు సంపూర్ణ మద్దతు తెలపడం ప్రజాస్వామ్య విజయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, కార్మికులు, వివిధ వ్యాపార, ట్రేడ్ అసోసియేషన్లు, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా పాల్గొని తమ లావాదేవీలు, వ్యాపార కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేసి బంద్‌కు సహకరించారని తెలిపారు. బంద్‌ను విఫలం చేస్తామని ముందుగా ప్రకటనలు చేసిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రజల్లో కనిపించకపోవడం వారి వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజల నుంచి లభించిన అపార మద్దతును చూసి వారు మౌనం పాటించాల్సి వచ్చిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి బీఆర్ఎస్‌ను రాజకీయంగా దెబ్బతీయాలని కుట్ర పన్నాయని ఆరోపించిన ఆయన, ప్రజలు మాత్రం వారి కుట్రలను తిప్పికొట్టి బంద్‌ను విజయవంతం చేశారని అన్నారు. కరీంనగర్ నగర ప్రశాంతత, శాంతిభద్రతల పరిరక్షణ కోసమే బంద్ నిర్వహించామని, ప్రజలు ఆ విషయాన్ని అర్థం చేసుకుని పూర్తి సహకారం అందించారని పేర్కొన్నారు. బంద్ సందర్భంగా ఉదయం నాలుగు గంటల నుంచే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జిల్లా అధ్యక్షులు జి.వి. రామకృష్ణారావుతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలను నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ఎన్ని



అరెస్టులు చేసినా, ఎంతమందిని అడ్డుకున్నా ప్రజలు మాత్రం బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలిపారని ఆయన స్పష్టం చేశారు. అధికార పార్టీ గుండాల బెదిరింపులకు భయపడకుండా బంద్‌ను విజయవంతం చేయడంలో పాల్గొన్న ప్రతి కార్యకర్తకు, నాయకులకు, కరీంనగర్ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# చలో పరేడ్ గ్రౌండ్ .. నేటి ప్రధాని మోదీ సభను సక్సెస్ చేయాలి

## వాహనల పోస్టర్ ఆవిష్కరించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**కరీంనగర్ బ్యూరో, మే 09 (జనంసాక్షి):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు (ఆదివారం రోజున) హైదరాబాద్ రానున్న నేపథ్యంలో సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభకు బిజెపి శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చి, సభను సక్సెస్ చేయాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రోజున కరీంనగర్ లోని టవర్ సర్కిల్లో ప్రధాని మోడీ సభకు తరలి వెళ్లే వాహనాలకు సంబంధించిన పోస్టర్ ను జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి , మేయర్ కోలగని శ్రీనివాస్, కార్పొరేటర్లు , బిజెపి నాయకులు కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ... మూడోసారి కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోదీ తొలిసారి హైదరాబాద్ వస్తున్నారని, ఈ నేపథ్యంలో లక్షలాది మందితో నేడు (ఆదివారం రోజున) సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాదులోని పరేడ్ గ్రౌండ్లో నిర్వహించే సభను కనీవినీ ఎరగని రీతిలో విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ సభను సక్సెస్ చేయాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలందరిపై ఉందన్నారు. ప్రతి కార్యకర్త స్వచ్ఛందంగా సభకు తరలిరావాలని కోరారు. ముఖ్యంగా కరీంనగర్ జిల్లా నుండి అత్యధిక సంఖ్యలో ప్రజలను తరలించాలనే ఆలోచనతో జిల్లా పార్టీ ఉందని, ఆ దిశలోనే అన్ని మండలాల నుండి అధిక సంఖ్యలో జన సమీకరణ చేయాలని సూచించారు. సభకు స్వచ్ఛందంగా తరలివచ్చే వారి కోసం రవాణా, కనీస సౌకర్యాలను ఏర్పాటు చేశామని, వాటిని వినియోగించుకోవాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆపరేషన్ సింధూర్ తరువాత తొలిసారి రాష్ట్రానికి వస్తున్నారనీ, 3వ సారి ప్రధాని పగ్గాలు చేపట్టిన తరువాత హైదరాబాద్ తొలిసారి రాబోతున్న నేపథ్యంలో బీజేపీ నాయకులంతా తమ అనుచరులు, టీంతో తప్పనిసరిగా పరేడ్ మైదానానికి తరలి రావాలని కోరారు. ప్రతి ఒక్కరూ మోదీ సభకు ఆహ్వానిస్తూ మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రధాని మోదీ సభ సక్సెస్ తో తెలంగాణలో రాజకీయ ముఖచిత్రం మారిపోతుందని, రాష్ట్రవ్యాప్తంగా బిజెపి గాలి వీచే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమం లో కరీంనగర్ నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ళ రమేష్, ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్, కార్పొరేటర్లు వంగల పవన్ కుమార్, కె ఏపీపీ చంద్ర తోట అనిల్, కన్న కృష్ణ, సర్దార్ బల్బీర్ సింగ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు, దండు కొమురయ్య, మండల/జోన్ అధ్యక్షులు తణుకు సాయి కృష్ణ, భూమల అనిల్ కుమార్, ముత్తునూటి హరీష్, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న

# కాంగ్రెస్ ప్రభుత్వం..

## ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న వొడితల ప్రణవ్..

**జమ్మికుంట, మే 9 (జనంసాక్షి):**
జమ్మికుంట మండలంలోని పలు ఇందిరమ్మ నూతన గృహ ప్రవేశాలకు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడతల ప్రణవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం లబ్ధిదారులు మంగళ హారతీతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేశామని,అందరూ సంతోషంగా ఇళ్లు కట్టుకొని గృహ ప్రవేశాలకు వెళ్తున్నారని, ఇళ్ళకు వెళ్ళే సమయంలో లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం వెలకట్టలేనీదని,అలాగే రెండవ విడతలో మరికొన్ని ఇళ్లను ఈ నెలాఖరులోగా మంజూరు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,నాయకులు,కా ర్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గోవులను అక్రమ తరలింపు చేస్తే కఠిన చర్యలు తప్పవు

## విశ్వహిందూ పరిషత్, పిట్లం



**పిట్లం మే 09 (జనంసాక్షి)**
పిట్లం మండల పరిధిలోని అక్రమంగా గోమాతలను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఎస్సై ఆంజనేయులు కు వినతి పత్రం అందజేశారు. బక్రీద్ సందర్భంగా హిందువుల ఆరాధ్య దైవమైన గోమాతలను అక్రమంగా తరలించి క్రూరకార్యకాలకు పాల్పడడం పట్ల హిందువుల మనోభావాలను దెబ్బతీసే చర్యాని మండిపడ్డారు. గోమాతలను అక్రమ తరలింపు పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సై కి కోరారు. ఈ కార్యక్రమంలో మంచి రంజిత్, అశోక్ రాజ్, శ్రీనివాస్, నిఖిల్, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.



## తోటి మిత్రురాలి కష్టంలో అండగా నిలిచిన బాల్య స్నేహితులు

సిరికొండ, మే 9 (జనం సాక్షి):
సిరికొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ 2003-04 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థిని,విద్యార్థులు తమ బాల్య స్నేహితురాలు ఫౌజియా సుల్తానాకు ఆర్థిక చేయూత అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.ఇటీవల ఫౌజియా సుల్తానా తల్లి గుండెపోటుతో మరణించగా, ఆమె సోదరికి గుండె సంబంధిత శస్త్రచికిత్స జరగడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న సహపాఠులు కలిసి స్పందించారు. తమ వంతు బాధ్యతగా రూ.42 వేల నగదు సహాయాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్ననాటి స్నేహం ఎప్పటికీ మరువలేనిదని, కష్టకాలంలో తోటి మిత్రురాలికి కు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం ఫౌజియా సుల్తానాను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమం లో 2003-04 బ్యాచ్‌కు చెందిన పలువురు మిత్రులు పాల్గొన్నారు. ఇలాంటి ఐక్యత, మానవత్వం, స్నేహబంధం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## మంచినీటి ట్యాంకు ను శుభ్రం చేయించిన సర్పంచ్



**పిట్లం మే 09 (జనంసాక్షి)**
పిట్లం మండల పరిధిలోని చిన్న కొడపుగల్ గ్రామంలో గ్రామ సర్పంచ్ రెడ్డి కిరణ్ కుమార్ శనివారం రోజున 5 వ వార్డులో మంచినీటి ట్యాంక్ ని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలో ఏర్పాటు చేసిన ట్యాంకులో పేరుకుపోయిన పూడికను తీయించి, బ్లీచింగ్ పౌడర్ తో శుభ్రం చేయించారు. గ్రామ ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వెంటనే స్పందించిన సర్పంచ్ కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.




## ఉచిత వైద్య శిబిరంలో 258మందికి ఉచితంగా వైద్య పరీక్షలు

### గంగిశెట్టి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు,భోజనం ఏర్పాట్లు



చిగురుమామిడి మే09 (జనంసాక్షి):
గ్రామంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని రేకొండ సర్పంచ్ అల్లెపు సంపత్ తెలిపారు.శనివారం మండలంలోని రేకొండ గ్రామంలో గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మేగా వైద్య శిబిరం నిర్వహించామని ట్రస్ట్ ఫౌండర్ గంగిశెట్టి జగదీశ్వర్ తెలిపారు.ఈ శిబిరాన్ని సర్పంచ్ అల్లేపు సంపత్ ప్రారంభించి వైద్య పరీక్షలు చేసుకున్నారు.ఈ శిబిరంలో శ్రీనివాస విజన్ సెంటర్ చిగురుమామిడి,మెడికవర్ హాస్పిటల్ వారు 258మందికి ఉచితంగా బిపి,షుగర్,ఈసిజీ, కంటి,వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమా వారికి ఉచితంగా మందులు,చుక్కల మందులు పంపిణీ,29మందికి కంట్లో పొరలు ఉన్నట్లు గుర్తించి వారికి ఉచిత కంటి ఆపరేషన్ చేపిస్తామని కంటి పరీక్ష నిపుణులు తిప్పారపు శ్రీనివాస్ తెలిపారు.ఈ శిబిరానికి వచ్చిన వారికి భోజనం వసతి కూడా కల్పించామన్నారు.అనంతరం డాక్టర్స్ కి సిబ్బందికి శాలువాతో సత్కరించి ట్రస్ట్ మెమెంటో అందచేయండం జరిగిందన్నారు.ఈ శిబిరంలో హాస్పిటల్ సిబ్బంది,కారోబర్ రాజు,గోపగాని తిరుపతి,సతీష్ , కార్తీక్,గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిండి గిర్ని షాప్ లో కరెంట్ షాక్ తో మహిళ మృతి



**భిక్కనూరు మే 09**
**(జనంసాక్షి మండల ప్రతినిధి)**
మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన బండి రేణుక 35 సం గ్రామంలో గత పది సంవత్సరాలు గా పిండి గిర్ని షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు, తేదీ;09.05. 2026 రోజు ఉదయం 7:50 నిమిషాలకు పిండి గిర్ని షాపును నీళ్లతో కడుగుతుండగా కరెంట్ షాక్ తగిలి కింద పడిపోయిన ఆమెను సుమారు 09:10 నిమిషాలకు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ పరిశీలించి అప్పటికే మరణిం చింది అని తెలిపినారు, ఈ విషయం తెలిసిన భిక్కనూరు పోలీసులు కామారెడ్డి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేరుకుని ఆమె భర్త బాలయోగి గౌడ్ గారి స్టేట్మెంట్ ప్రకారం అక్కడే అన్ సీటర్ ఫైర్"హెౕ ౹ామిఇ ఈఎఫ్ఐ"నమోదు చేసి పంచరమ్మని నిర్వహించి దర్యాప్తు చేపట్టినట్లు భిక్కనూరు ఎస్సై డి.ఆంజనేయులు తెలిపారు, ఈవిషయం తెలవగానే గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు.

## ఎన్టీఆర్ నాగర్ లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### ముగ్గురు అదుపులో.. ఇద్దరు పరారీ..

గోదావరిఖని, జనంసాక్షి:
స్థానిక ఎన్ టీ ఆర్ నగర్ వాటర్ ట్యాంకు సమీపంలోని ఓ గదిలో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు గోదావరిఖని 1 టౌన్ పోలీసులు దాడి నిర్వహించారు. ఎస్సై అనూష ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిలో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు.సంఘటన స్థలం నుంచి 52 పేక ముక్కలు, రూ.2,490 నగదు, మూడు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పంచుల సమక్షంలో సీజ్ ప్రక్రియ పూర్తి చేసిన పోలీసులు, పరారైన వ్యక్తుల వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.ఈ మేరకు ఇన్‌స్పెక్టర్-2 సయ్యద్ అఫ్జలుద్దీన్ వివరాలు వెల్లడించారు.

# అకాల వర్షంతో తడిసిన ధాన్యం అన్నదాత ఆగమాగం



**రుద్రంగి మే 9 (జనంసాక్షి)**

రుగ్రంగి మండల కేంద్రంలో శనివారం సాయంత్రం అకస్మాత్తుగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసిన ధాన్యం వర్షంతో తడిసి ముద్దాయింది. ధాన్యంపై కప్పిన టార్పాలిన్ కవర్లు గాలికి కొట్టుకు పోవడంతో రైతులు ఆరబోసిన వరి ధాన్యం తడిసి పోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకాల వర్షంతో తడిసి ముద్దవ్వడంతో అన్నదాత ఆగమాగం కావడం జరిగింది. ఈదురుగాల ధాటికి పలుచోట్ల మామిడి కాయలు నేలరాలాయి. అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



# పెద్ద జయంతి ఉత్సవాలకు అంకురార్పణ

## స్వామివారి ఉత్సవ మూర్తి పల్లకిలో ఊరేగింపు

**మల్యాల మే 9 (జనం సాక్షి)**

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో మే 10వ తేదీ ఆదివారం నుండి 12వ తేదీ మంగళవారం వరకు జరగనున్న పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలకు శనివారం అంకుల్ అర్పణ చేశారు. సాయంత్రం 6 గంటల 30 నిమిషాలకు యాగశాల శుద్ధి, పుణ్యాహవచనం, అంకురార్పణ, అఖండ దీపస్థాపన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అంకురార్పణ చేశారు. ప్రధాన ఆలయం నుండి స్వామివారి ఉత్సవమూర్తిని ఆలయ అర్చకులు వేద పండితులు ఆలయ ఈవో అధికారులు భక్తులు ఊరేగింపుగు చేశారు. వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలకు శుభారంభం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్. అంజనారెడ్డి, స్థానాచారి కపిందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, సునీల్, టెంపుల్ ఇన్స్పెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బొబ్బిలి చెరువులో పడి యువకుడు మృతి



**భిక్కనూరు మే 09( జనం సాక్షి ప్రతినిధి )**

భిక్కనూరు మండలంలో విషాద ఘటన రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన జిల్లెల్ల బాపిరెడ్డి (25) చెరువులో పడి మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన జిల్లెల్ల బాలమణి, చిన్న రాంరెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రాజశేఖర్ రెడ్డి ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తుండగా, రెండవ కుమారుడు జిల్లెల్ల బాపిరెడ్డి ఇంటి వద్దే ఉంటున్నాడు. వారి తండ్రి కొన్ని సంవత్సరాల క్రితమే మరణించినట్లు తెలిసింది. ఈనెల 07వ తేదీన సాయంత్రం సుమారు 5:00 గంటల సమయంలో పొలం నుంచి తీసుకొచ్చిన వడ్లను ఆరబెట్టే విషయంలో బాపిరెడ్డి తన తల్లితో గొడవపడ్డాడు. పని చేయడం చేతకాదని తల్లిమందలించడంతో మనస్తాపానికి గురైన బాపిరెడ్డి ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల వద్ద, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం సుమారు 9:00 గంటల సమయంలో భిక్కనూరు గ్రామ శివారులోని బొబ్బిలి చెరువులో బాపిరెడ్డి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న భిక్కనూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై డి. ఆంజనేయులు తెలిపారు. ఈ ఘటనతో రామేశ్వర్‌పల్లి గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.



# ఎల్‌బీ నగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం..

గోదావరిఖని, జనంసాక్షి:

రామగుండం కార్పొరేషన్ పరిధి 41వ డివిజన్‌లో శనివారం కార్పొరేటర్ మార్కపురి సూర్య ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ భవ్య కంటి శాస్త్ర చికిత్స నిపుణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలు సుమారు వందమంది ఈ ఉచిత సేవలను ఉపయోగించుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య మాట్లాడుతూ 41వ డివిజన్ ప్రజలకు ఉచిత కంటి శిబిరాన్ని సిపిఐ జండా వద్ద నిర్వహిం చామన్నారు. అలాగే ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి ఈ క్యాంపు నిర్వహించిన భవ్య కంటి ఆసుపత్రి వారికి డాక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా డివిజన్ ప్రజల కోసం ఇలాంటి క్యాంపులు నిర్వహించబోతున్నామని వాటిని డివిజన్ ప్రజలు సద్వినియోగ పర్చుకోవాలని తెలిపారు. భవ్య వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వైద్య సేవలను వారికి సూచించారు.



# రైతు వేదికలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక రైతు వారము కార్యక్రమాలు




**సుల్తానాబాద్,మే 09(జనంసాక్షి) :**

99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో రైతు వారముకార్యక్రమం లో భాగంగా మండలంలో ని చిన్నకలువల, గర్రెపల్లి, రైతు వేదిక లలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల తో సమావేశం ఏర్పాటు చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం రామగిరిఖిల్ల శాస్త్రవేత్త డాక్టర్ వెంకన్న మాట్లాడుతూ, వరి పంటలో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ సేంద్రియ ఎరువులైన వర్మికంపోస్ట్ వంటి ఎరువులను వాడటం ద్వారా భూసారాన్ని పరిరక్షించ వచ్చునని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి పైడితల్లి, మాట్లాడుతూ వరి కోసిన తర్వాత కొయ్యకళ్ళు కలబెట్టడం ద్వారా భూసారం దెబ్బతింటుందని, రైతులు కొయ్యకళ్ళు కలబెట్టకుండా భూమిలో కలియ దున్నడం వలన తిరిగి తర్వాత వేసే పంటకు ఎరువు కింద ఉపయోగ పడుతుందని భూసార పరిరక్షణ అందరి బాధ్యత అని తెలియజేస్తూ రైతులతో భూసార పరిరక్షణ పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, చిన్నకలువల చైర్మన్ మోహనరావు, గ్రామ సర్పంచ్లు ఏరుకొండ, స్రవంతి, వీరగోని రమేష్ గౌడ్, దీకొండ భూమేష్, చిన్నన్న, ఏఈఓ ప్రశాంత్, హార్టికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.



## సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా

# ఉచిత వైద్య శిబిరం

## గంగిశెట్టి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

### వైద్య పరీక్షల అనంతరం భోజన వసతి..








**చిగురుమామిడి మే08(జనంసాక్షి):**

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మేగా వైద్య శిబిరం నిర్వహించామని ట్రస్ట్ ఫౌండర్ గంగిశెట్టి జగదీశ్వర్ తెలిపారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ అల్లేపు సంపత్ గారు ప్రారంభించి వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఈ శిబిరంలో శ్రీనివాస విజన్ సెంటర్ చిగురుమామిడి మరియు మెడికవర్ హాస్పిటల్ వారు 258 మందికి ఉచితంగా బిపి, షుగర్ , ఈ సి జీ, కంటి, మరియు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమా వారికి ఉచితంగా మందులు, చుక్కల మందులు పంపిణీ మరియు 29 మందికి కంట్లో పొరలు ఉన్నట్లు గుర్తించి వారికి ఉచిత కంటి ఆపరేషన్ చేపిస్తామని కంటి పరీక్ష నిపుణులు తిప్పారపు శ్రీనివాస్ తెలిపారు. ఈ శిబిరానికి వచ్చిన వారికి భోజనం వసతి కూడా కల్పించామాని, అనంతరం డాక్టర్స్ కి మరియు సిబ్బంది కి శాలువాతో సత్కరించి ట్రస్ట్ మెమెంటో అందచేయండం జరిగింది. ఈ శిబిరంలో హాస్పిటల్ సిబ్బంది, కారోబర్ రాజు, గోపగాని తిరుపతి, సతీష్ , కార్తీక్, మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మండలంలో శోభియ మానంగా ఆంజనేయ స్వాముల శోభయాత్ర

## - చిన్న కల్వలలో సీతారాముల కళ్యాణం, పట్టాభిషేకం, హనుమ జయంతి

**సుల్తానాబాద్,మే 09(జనంసాక్షి) :** పవిత్ర హనుమాన్ మాల ధరించిన హనుమాన్ భక్తులు మండలంలోని పలు గ్రామాలలో శనివారం హనుమాన్ విగ్రహంతో పురవీధులలో శోభ యాత్రను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి శోభయాత్ర ను చూసి పులకించి పోయారు. చిన్నకల్వల గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ సీతారామచంద్రస్వామి సంకట వియోచన రామభక్త వీర హనుమాన్ బ్రహ్మోత్సవాలను వేద పండితులు ప్రారంభించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఉదయం 11 గంటలకు శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం సోమవారం సామ్రాజ్య పట్టాభిషేకం మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు భగవత్ దాసులు వంగపల్లి అనసూయ దేవి సుగుణాకర్ రావు, ఇనుగంటి దమయంతి లక్ష్మీ మనోహర్ రావు లు తెలిపారు. నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించి పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు యజ్ఞాకులు, కొండపాక సత్యనారాయణ చార్యులు వివరించారు. అలాగే మండలంలోని పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు హోమాలు అఖండ భజన హనుమాన్ చాలీసా పారాయణం తదితర కార్యక్రమాలు జయంతి వరకు నిర్విరామంగా కొనసాగిస్తున్నారు.హనుమాన్ మాల ధరించిన స్వాములు 41 రోజులు, 21, 11 రోజులు మాలలు ధరించిన మాలదారు లు పెద్ద హనుమాన్ జయంతి వేడుకలలో పాల్గొని మాలవిరమణ చేపట్టనున్నారు. వివిధ ఆంజనేయ స్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు, నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమాల తోపాటు హోమాలు, అగ్నిగుండాలు, కొనసాగించనున్నారు. చిన్నకల్వల దేవాలయంలో ప్రతి సంవత్సరం వలె ఈ సంవత్సరం హోమం



కార్యక్రమాన్ని దేవాలయ వ్యవస్థాపకులు సుగుణాకర్ రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి, మండల కేంద్రంలోని పెరిగిద్దె ఆంజనేయ స్వామి దేవాలయం తో పాటు పూసాల శంభుని శివాలయంలో నిత్య అన్న ప్రసాద వితరణ కొనసాగు తోంది కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లే ఆంజనేయ మలదారు లకు మండల కేంద్రంలో యువ సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో చల్లని మంచి నీరు తో పాటు అల్పాహారం పండ్లు, డ్రై ఫ్రూట్స్ అందించే కార్యక్రమాన్ని తుమ్మ రాజ్ కుమార్ నిర్వహిస్తున్నారు.



## 'ఖని' వన్‌టౌన్ ఎస్ఐ రమేష్ వాహనాల తనిఖీ

### రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులకు అవగాహన..

గోదావరిఖని, జనంసాక్షి: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి ఫైవింక్లయిన్, రమేష్‌నగర్ తదితర ప్రాంతాల్లో గోదావరిఖని వన్ టౌన్ ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల తనిఖీ నిర్వహించారు.ఈ తనిఖీల సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నిబంధనలు,రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ వంటి వాహన సంబంధిత పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ ధరించడం ద్వారా ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం,సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం,మైనర్ల చేత వాహనాలు నడిపించడం వంటి ప్రమాదకర చర్యలు చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.ప్రజలు ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.



## విద్యుత్ హెచ్‌టి లైన్ల నిర్వహణ లోపమే

# ప్రమాదాలకు కారణం

ఎల్లారెడ్డిపేట, మే 09, (జనంసాక్షి) : ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకున్న విద్యుత్ ప్రమాదంలో హెల్పర్‌కు గాయాలైన ప్రమాద స్థలాన్ని రాష్ట్ర లీగల్ ప్రొటెక్షన్ హ్యూమన్ రైట్స్ యూత్ జనరల్ సెక్రటరీ మారుపాక హరీష్ శనివారం ప్రత్యేకంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ట్రాన్స్‌ఫార్మర్‌పై విధులు నిర్వహిస్తున్న హెల్పర్ ద్యాప లక్ష్మణ్‌కు జరిగిన విద్యుత్ ప్రమాదం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ ఘటనపై గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శి, విద్యుత్ శాఖ అధికారులతో సమగ్రంగా చర్చించగా, టాన్స్‌ఫార్మర్ సమీపంలో విపరీతంగా పెరిగిన చెట్లు హెచ్‌టి విద్యుత్ లైన్లను తాకడం వల్ల ఎల్‌టి లైన్లలో రివర్స్ కరెంట్ ప్రవహించి ఈ ప్రమాదం సంభవించినట్లు గుర్తించారు. ఇది సహజ ప్రమాదం కాదని, సంబంధిత శాఖల నిర్లక్ష్యం, నిర్వహణ లోపం కారణంగా జరిగిన తీవ్రమైన ఘటన అని హరీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామాల్లో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, చెట్ల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ లేకపోవడం వల్ల అమాయక కార్మికులు ప్రాణాపాయ స్థితికి చేరుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు మరల జరగకుండా ఉండేందుకు వెంటనే హెచ్‌టి, ఎల్‌టి లైన్ల పరిసరాల్లో ఉన్న చెట్లను పూర్తిగా తొలగించడం, ట్రాన్స్‌ఫార్మర్ల భద్రతా తనిఖీలు నిర్వహించడం, విద్యుత్ లైన్లను సకాలంలో మరమ్మతులు చేయడం, భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న హెల్పర్లు, లైన్‌మేన్‌లు భద్రత కోసం గ్రామపంచాయతీ సెక్రటరీలు, సర్పంచ్‌లు, విద్యుత్‌శాఖ అధికారుల సమన్వయంతో పనిచేసి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఒక చిన్న నిర్లక్ష్యం ప్రాణంతక ఘటనలకు దారీ తిస్తుందని, ఇకపై ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని హరీష్ హెచ్చరించారు.

## జీడీకే.11వ గనిలో యాజమాన్య

# నిర్లక్ష్యంతో తప్పిన ప్రమాదం

### సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తుమ్మల రాజారెడ్డి..

**గోదావరిఖని, జనంసాక్షి:** సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో జీడీకే.11వ గనిలో నైట్ షిఫ్ట్ తెల్లవారుజామున ఒకటిన్నర గంటలకు ఎలక్ట్రికల్ షాక్ ప్రమాదానికి గురైన కార్మికులు కోల్ కట్టర్ సురేష్, యశ్వంత్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి శనివారం సింగరేణి ఏరియా ఆసుపత్రి లో మాట్లాడారు. ఈ ప్రమాదానికి కారణం పూర్తిగా యజమాన్య నిర్లక్ష్య వైఖరి అని తెలిపారు. అధునాతనమైన యంత్రాలు జీడికే.11వ గనిలో రెండు కంటిన్యూస్ మైనర్స్,ఎల్‌హెచ్‌డి సెక్షన్ నడుస్తున్నాయని, మైన్‌లో దాదాపు 1800 మంది



కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని రాజారెడ్డి తెలిపారు.వివిధ సెక్షన్లలో పది పదకొండు షిఫ్ట్‌లో పనిచేస్తున్నారని,ఒకరిని ఒకరు కలుసుకొని పని పరిస్థితులు, రక్షణ చర్యలపై చర్చించే అవకాశం లేకుండా పని చేస్తున్న పరిస్థితి జీడీకే.11వ గనిలో ఉందన్నారు.నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారుతున్న పరిస్థితి ఉందన్నారు.పట్టించుకునే అధికారులు కరువయ్యారని పేర్కొన్నారు.వాస్తవంగా ఎల్‌హెచ్‌డి బండి నడిచేటప్పుడు ఆపరేటర్ వెనకముందు చూసే పరిస్థితి ఉన్నప్పటికీ, చుట్టుపక్కల చూడడానికి కార్మికులను కేటాయించాల్సిసింది పోయి ఆ మనిషిని కూడా తగ్గించిన పరిస్థితి ఉందన్నారు. ఎల్‌హెచ్‌డి బండి 'బకిట' బొగ్గు పాయ పక్కన ఉన్న ఆర్మ్యూర్ కేబుల్ ని లాగడం వలన డ్రిల్ కేబుల్ ఆర్మ్యూర్ కేబుల్ మొత్తం ప్యానల్‌ను గుంజడంతో ఆర్మ్యూర్ కేబుల్ పవర్ లీకై ఆ ప్రాంతంలో 70 మీటర్స్ దూరంలో పనిచేస్తున్న కోల్ కట్టర్స్ కరెంట్ షాక్ వచ్చిందని రాజారెడ్డి తెలిపారు.ఎల్‌హెచ్‌డి బండి ఆర్మ్యూర్ కేబుల్‌తో వెనక్కి వెళ్లడం వల్ల షాక్ కొట్టి కార్మికులను వదిలిపెట్టిందన్నారు. లేదంటే కరెంటు షాక్ ప్రమాదంలో మరణించేవారని రాజారెడ్డి పేర్కొన్నారు. పెద్ద ప్రమాదం నుండి బతికి బయటపడడం వారి అదృష్టంగా భావిస్తున్నామన్నారు.ఇప్పటికైనా కార్మికుల సేఫ్టీ విషయంలో ఉత్పత్తి జరుగుతున్న ప్రదేశాలలో కార్మికులను తగ్గించి ఉత్పత్తి తీసుకోవడం దురుద్దేశమని, దీనితోనే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.యాజమాన్యం ప్రమాదాలను గుర్తించి తగువిధంగా రక్షణ చర్యలు చేపట్టేందుకు కృషి చేయాలని రాజారెడ్డి డిమాండ్ చేశారు. రాజారెడ్డి వెంట ఆర్జీవన్ గౌరవ అధ్యక్షులు ఆరెపల్లి రాజమౌళి, గని పిట్ కార్యదర్శి జంగపల్లి మల్లేష్, ముల్కాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం రైల్వే స్టేషన్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు..

అంతర్గాం, జనంసాక్షి: నేరాల నియంత్రణ, గంజాయి అక్రమ రవాణా..వినియోగం, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను అరికట్టేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ



బి.రామ్‌రెడ్డి ఆదేశాల మేరకు రామగుండం సీఐ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో శనివారం రామగుండం రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించారు.యువత..ప్రజల ఆరోగ్యానికి, ప్రాణాలకు హాని కలిగించే గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణతో పాటు వివిధ నేరాలకు పాల్పడే నిందితుల కదలికలను గుర్తించే లక్ష్యంతో రైల్వే స్టేషన్‌లో సిబ్బందితో కలిసి ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లోని సీసీ కెమెరాల పనితీరు,స్టేషన్ పరిసర ప్రాంతాలు,పార్సెల్ సర్వీస్ కేంద్రాలు, హైదరాబాద్, మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే ప్రయాణికులు ప్రయాణించే రైల్వే బోగీలు, అనుమానాస్పదంగా కనిపించే ప్రతీ పార్సిల్, రవాణా బ్యాగులు, ప్రయాణికుల సామగ్రిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఇతర ప్రాంతాల నుంచి రైల్వే మార్గం ద్వారా వివిధ నేరాలకు పాల్పడే నిందితులు ప్రయాణించే అవకాశం ఉన్నందున ఆకస్మికంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

## రామగుండంలో రాజేందర్‌కు సన్మానం..



**అంతర్గాం, జనంసాక్షి:** రామగుండం అక్బర్‌నగర్ హెచ్‌ఆర్‌సిఐ (హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా) కార్యాలయం లో శనివారం రాజేందర్‌ను ఘనంగా సన్మానించారు.హెచ్‌ఆర్సీఐ కుటుంబంలో లభించిన ఈ గౌరవం మరింత బాధ్యతతో పనిచేయాలని ప్రేరణ ఇస్తోందని రాజేందర్ తెలిపారు.నమ్మకం ఉంచి ప్రోత్సాహం అందించిన నేషనల్ కమిటీ..స్టేట్ కమిటీ పెద్దలు, నాయకులు, సహచర సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా మీడియా ప్రోగ్రామ్స్ సెక్రెటరీ ప్రసాద్,పెద్దపెల్లి జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆరిఫ్, పెద్దపెల్లి జిల్లా అడిషనల్ జనరల్ సెక్రెటరీ భోగి లింగమూర్తి, పెద్దపల్లి జిల్లా ఉమన్ పోర్టు వెల్ఫేర్ సెక్రెటరీ జె శాంత, పెద్దపల్లి జిల్లా ఉమన్ పోర్టు వైస్ ప్రెసిడెంట్ పూనా వాణి, కొండల అరుణ, పెద్దపల్లి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ చందా చంద్రకాంత్, రామ్మూర్తి, దొగ్గల ప్రవీణ్‌కుమార్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి నీ కాపాడాలని రైతుల ఆందోళన

- గ్రామ అవసరాల కోసం భూమి వినియోగించాలి ❑అధికారులకు కోరిన గ్రామస్తులు
- జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసిల్దార్ స్పందించాలి ❑ మాభూమి మాకే కావాలి
- పేదవాడికి గుంట పట్టా చేయని అధికారులు భూస్వాములకు, ఎకరాల పట్టా ఎలా చేస్తారు
- సర్వే నెంబర్ 221 పై ప్రజల ఆందోళన





**సుల్తానాబాద్,మే 09(జనంసాక్షి) :** మండలంలోని కనుకుల,గ్రామంలోని ప్రభుత్వ భూమి అక్రమ నకు గురైందని దానిని కాపాడాలని కనుకుల గ్రామ ప్రజలు రైతులు సర్పంచ్ కర్రె కవిత కుమారస్వామి ఆధ్వర్యంలో,ఆందోళన చేపట్టారు. శనివారం గ్రామస్తులు గత కొన్ని సంవత్సరాలుగా రైతుల పండించిన వరి ధాన్యాన్ని ఆరబెట్టి విక్రయించేందుకు వినియోగిస్తున్న భూమిని స్థానికంగా ఓ బడా వ్యాపారి భార్య శ్రీలత పేరు మీద అక్రమంగా పట్టా పొంది, గ్రామ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వెంటనే చర్యలు తీసుకొని తమ గ్రామ నికి చెందిన భూమి ని గ్రామానికి అప్పగించాలని ప్రజలు ఆందోళనకు దిగారు. పేదవారు గుంట, భూమిని పట్టా చేయాలని అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగి కాళ్ల చేతులు పట్టుకున్న స్పందించని అధికారులు,నిబంధనల పేరుతో ముప్పు తిప్పలు పెట్టే దాఖలాలు కో కొల్లలు ఉన్నాయని. అన్నారు. మండలంలోని కనుకుల గ్రామంలో గల సర్వే నెంబర్ 221/4,లో ప్రభుత్వ భూమి 100 ఎకరాలు ఉండగా, అందులో నుండి 11 ఎకరాల 31 గుంటల ప్రభుత్వ భూమిని, ప్రముఖ కాంట్రాక్టర్, భూస్వామి, జిన్నా. శ్రీలత శ్రీనివాసరెడ్డి కి అధికారులు భూమిని అక్రమ పట్టా చేయించి ఇచ్చారని గ్రామ ప్రజలు ఆరోపించారు. ప్రజల అవసరాల కోసం ఉపయోగపడే, విధంగా చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్ ,ఆర్ డి ఓ , తాసిల్దార్ లకు విన్నవించిన పట్టించుకోవడంలేదని. కనుకుల గ్రామ సర్పంచి కర్రే కవిత కుమార స్వామి ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 100 మంది, కుల సంఘాల నాయకులు ఆందోళన దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రముఖ కాంట్రాక్టర్ వ్యాపారవేత్త జిన్నా శ్రీనివాస్ రెడ్డి తన భార్య శ్రీలత పేరు మీద, డబ్బు పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వ భూమిని అక్రమ పట్టా చేయించుకోవడమే కాకుండా, నాలా కన్వర్షన్ చేయించడం, ప్రభుత్వాన్ని మోసం చేసి, పక్కదారి పట్టించడమే నని ఆరోపిస్తూ, ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడికి ప్రభుత్వ భూమి ఒక్క గుంట పట్టా చేసి, నాలా కన్వర్షన్ చేయమంటే, ఎన్నో ఇబ్బందులను పెడుతున్న అధికారులు, భూ స్వాములకు, కాంట్రాక్టర్లకు, బడా వ్యాపారులకు, నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిని ఏ విధంగా పట్టా చేసి నాలా కన్వర్షన్, చేస్తారని ప్రశ్నించారు. ఈ అక్రమ పట్టా, చేయడానికి సహకరించిన అధికారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అక్రమ పట్ట భూమి పై పూర్తిస్థాయిలో విచారణ చేసి, వెంటనే అక్రమ పట్టా, నాలా కన్వర్షన్ రద్దుచేసి, గ్రామా ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రె కవిత కుమారస్వామి,ఉప సర్పంచ్ వడ్లకొండ వివేక్, నాయకులుమైలారం నారాయణ,రాజయ్య,మాచర్ల అశోక్,గాండ్ల శంకర్, బొల్లం కుమార్,రెడ్డి కుమార్, మొగిలి,తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పలువురు పాల్గొన్నారు.

# ఈనెల 11 నుండి పాఠశాలలలో ప్రజా పాలన కార్యక్రమాలు






**సుల్తానాబాద్,మే 09(జనంసాక్షి) :** పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం 11 నుండి 17వరకు అన్ని పాఠశాలల్లో విద్యా వారోత్సవాలు నిర్వహించాలని మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య మండలంలోని సమస్త,పిఎస్, యుపిఎస్, హెచ్ ఎస్ హెచ్ ఎం ఎస్,ను ఆదేశించారు. ఈ సందర్భంగా, మండల విద్యాధికారి రాజయ్య,మాట్లాడుతూ అన్ని పిఎస్, యుపిఎస్, హెచ్ ఎస్ పాఠశాలలు క్రింది కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు ఏ ఏ పి సి,సభ్యులు చురుకైన భాగస్వామ్యాన్ని నిర్ధారించాలని కోరారు. 1వ రోజు,11న ఫౌండేషన్ డే సమ్మర్ క్యాంపులు. అన్ని పాఠశాలల్లో ఫౌండేషన్ డే కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థుల భాగస్వామ్యంతో సమ్మర్ క్యాంప్ కార్యక్రమాలు నిర్వహించాలి. పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్నమిగిలిపోయిన అభివృద్ధి సివిల్ వర్క్స్ పనులను ప్రారంభించి, సాధ్యమైన చోట పాఠశాల ప్రాంగణ పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 4వ రోజు ,14న ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం మెగా పీటీఎం సందర్భంగా, పాఠశాల స్థాయి అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలనీ. ఉదయం 8:30 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ పి,టి,ఎం, నిర్వహించి, విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతి, అభ్యాస ఫలితాలు పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలపై తల్లిదండ్రులతో చర్చించాలనీ,ప్రభుత్వ పాఠశాలల్లో క్రమమైన హాజరు నమోదు కోసం తల్లిదండ్రులను ప్రోత్సహించాలని ఉపాధ్యాయుల పాల్గొనడం హాజరు నివేదికను ఎం ఆర్ సి సుల్తానాబాద్ కు తప్పనిసరిగా సమర్పించాలనీ కోరారు. 5వ రోజు ,15న గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా పఠన కార్యక్రమాలు, కథల చెప్పడం, పుస్తక ప్రదర్శనలు వ్యాసరచన పోటీలు నిర్వహించాలనీ. విద్యార్థులు పాఠశాల గ్రంథాలయాన్ని సమర్థవంతంగా వినియోగించేలా ప్రోత్సహించాలనీ పిల్లల్లో పఠన అలవాటును పెంపొందించుకోవాలనీ సూచించారు. 6వ రోజున,కళలు, చేతిపనులు సాంస్కృతిక దినోత్సవం సందర్భంగా,చిత్రలేఖనం, పెయింటింగ్, చేతిపనులు, గానం, నృత్యం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని విద్యార్థులందరూ పాల్గొనేలా ప్రోత్సహించి విద్యార్థుల కళా, చేతిపనులను పాఠశాలలో ప్రదర్శించాలనీ కోరారు. విద్యా విజయోత్సవం జిల్లా స్థాయి కార్యక్రమం సందర్భంగా, ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల్లో 540 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను జిల్లా స్థాయిలో సన్మానించి. అర్హులైన విద్యార్థుల వివరాలను వెంటనే గుర్తించి పంపించాలని సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించి, తల్లిదండ్రులు సమాజంలో అవగాహన కల్పించాలని సమస్త పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, విద్యా వారోత్సవ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతిరోజు కార్యక్రమాల ఫోటోలు, హాజరు వివరాలు సంక్షిప్త నివేదికలను తప్పనిసరిగా ఎం. ఆర్. సి సుల్తానాబాద్ లో సమర్పించాలనీ తద్వారా జిల్లా ఉన్నతాధికారులకు పంపబడుతుందన్నారు. ఈ, కార్యక్రమ ఘనవిజయానికి ఉపాధ్యాయులు సిబ్బంది అందరూ సహకరించవలసిందిగా మండల విద్యాధికారి ఆరెపల్లి రాజయ్య కోరారు.



# పూసాలలో భక్తి పారవశ్యంతో ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

- జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగిన పూసాల - భారీగా పాల్గొన్న హనుమాన్ భక్తులు

**సుల్తానాబాద్,మే 09(జనంసాక్షి) :** సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రంలో,హనుమాన్ జయంతి సందర్భంగా పూసాల లో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర భక్తి, ఉత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. శంభు లింగేశ్వర స్వామి దేవాలయ, హనుమాన్ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు, నిర్వహించిన అనంతరం భారీ శోభాయాత్రను ప్రారంభించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి ప్రపత్తిని చాటుకున్నారు. శోభాయాత్రలో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని అందంగా అలంకరించిన రథంపై ఊరేగింపుగా తీసుకెళ్లారు. డప్పు వాయిద్యాలు, భజనలు, కోలాటాలు, కాషాయ జెండాలతో గ్రామ వీధులన్నీ ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. జై శ్రీరామ్ జై హనుమాన్'' నినాదాలతో పూసాల గ్రామం మార్మోగిపోయింది. వార్డులలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ శోభాయాత్రకు మహిళలు ఆంజనేయ స్వామి టెంకాయలు కొట్టి,హారతులతో స్వాగతం పలికారు. యువకులు భారీ సంఖ్యలో పాల్గొని క్రమశిక్షణతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తులకు నిర్వాహకులు చల్లని నీరు, పానీయాలు, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హనుమాన్ జయంతి వేడుకలు యువతలో భక్తి, దేశభక్తి, ధైర్యసాహసాలను పెంపొందిస్తాయని తెలిపారు. ప్రతి సంవత్సరం కంటే ఈసారి మరింత వైభవంగా శోభాయాత్ర నిర్వహించామని హనుమాన్ భక్తులు పేర్కొన్నారు. శాంతియుత వాతావరణంలో ముగిసిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, మహిళలు, హనుమాన్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల శ్రేయసే సొసైటీల లక్ష్యం

- సింగిల్ విండో చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన మోహన్ రావు





**సుల్తానాబాద్,మే 09 ( జనంసాక్షి) :** రైతుల శ్రేయస్సు కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు చిత్తశుద్ధితో, నిరంతరం కృషి చేస్తున్నాయని సింగిల్ విండో చైర్మన్ గా తిరిగి పదవి బాధ్యతలు చేపట్టిన చైర్మన్, దేవరనేని మోహన్ రావు అన్నారు. శనివారం స్థానిక పిఎసిఎస్ చిన్న కలువల కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టిన అనంతరం పాలకవర్గ సర్వ సభ్య సమావేశం, సింగిల్ విండో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ దేవరనేని మోహన్ రావు మాట్లాడుతూ, ఏప్రిల్ 25 నుండి నేటి వరకు 14 రోజులు సింగిల్ విండో పరిధిలోని 9 సెంటర్లలో దాదాపు 210 మంది రైతుల వద్ద నుండి,వరి ధాన్యం కొనుగోలు చేపట్టామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం మొత్తం 20 54 8 క్వింటాళ్లు దాటిందన్నారు. రైతులు ఎవరు అధైర్యపడవద్దని ప్రభుత్వం అండగా ఉందని రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు రైతులకు త్వరితగతిన బిల్లులు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తిరిగి పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు కు మోహన్ రావు,ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గత నాలుగు నెలలుగా విధులు నిర్వహించిన ప్రత్యేక అధికారిగా ముఫాసిర్ హైమద్ ను ఘనంగా సన్మానించారు. తిరిగి బాధ్యతలు స్వీకరించిన మోహన్ రావు తో పాటు పాలకవర్గ సభ్యులను సంఘ సీఈవో వల్ల కొండ రమేష్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# మంత్రి శ్రీధర్ బాబును విమర్శిస్తే సహించేది లేదు

## మంథని నియోజకవర్గ అభివృద్ధి దుద్దిల్ల కుటుంబంతోనే సాధ్యం

## విలేకరుల సమావేశంలో మంథని కాంగ్రెస్ నాయకులు




మంథని, (జనంసాక్షి) :
మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ కు రాజకీయ భిక్ష పెట్టిందే దుద్దిళ్ల కుటుంబమని, అలాంటి కుటుంబాన్ని విమర్శించడం సిగ్గుచేటని మంథని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శనివారం మంథని పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆయిలి ప్రసాద్, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యుడు శశి భూషణ్ కాచే, మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, డిసిసి అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం లు మాట్లాడుతూ.. మంత్రి శ్రీధర్ బాబు, శీను బాబు ల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లవేళలా ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. శ్రీను బాబును ప్రతిసారి ఏదో ఒక కార్యక్రమంలో విమర్శించడమే ధ్యేయంగా పుట్ట మధు వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. అడవి సోమనపల్లి ప్రాంతంలో వరి కొనుగోలు జాప్యం జరుగుతుందని పుట్ట మధు మాట్లాడిన తీరు సరైనది కాదన్నారు. ఆ ప్రాంతంలో వరి కోతలు ఆలస్యంగా జరగడం వల్ల ప్రతి సంవత్సరం కొనుగోలు ఆలస్యం జరుగుతుందే తప్ప శ్రీధర్ బాబు, శీను బాబులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ప్రతినిత్యం రైతుల శ్రేయస్సు కోరుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను తమ నాయకుడు శ్రీధర్ బాబు ఇప్పటికే అధికారాలకు ఆదేశాలు జారీ చేశాడని అన్నారు. మంథని బస్టాండులో అకాల వర్షంతో నీరు నిండడంతో మాజీ ఎమ్మెల్యే హంగామా చేశాడని విమర్శించారు. మేడారం జాతర సమయంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలతో చిన్న లోపం ఏర్పడి వర్షపు నీరు బయటకు వెళ్ళలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మా నాయకుడు శ్రీధర్ బాబు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంథని బస్టాండ్ ను సందర్శించి మహిళలు ప్రయాణికు లతో మాట్లాడి మహాలక్ష్మి పథకం గురించి ఆరా తీసి మూత్రశాలలు, ప్రయాణికులకు రెస్ట్ రూమ్, బాలింతలకు తల్లిపాలు ఇచ్చేందుకు రూములను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. దీనికోసం సంబంధిత మంత్రి పొన్నం ప్రభాకర్ తో మాట్లాడి 95 లక్షల రూపాయలు మంజూరు చేయించార న్నారు. మేడారం జాతర, శివరాత్రి పండుగల వల్ల టెండర్ల నిర్వహణలో జాప్యం జరిగిందన్నారు. ఈ నిధు లతో పాటు మరిన్ని నిధులు వెచ్చించి మంథని బస్టాండును సుందరికరిస్తామని వారు స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాల వరకు మంథని బస్టాండు మోడల్ బస్టాండ్ గా తీర్చిదిద్దుతామన్నారు. మంథని నియోజకవర్గన్ని రానున్న రెండున్నర సంవత్సరాలలో మూడింతల అభివృద్ధి చేస్తామన్నారు. మంథని బస్టాండులో పుట్ట లింగమ్మ పేరును తాము తొలగించామని అనడం సబబు కాదని ఎన్నికల కోడ్ వల్ల వాటిని అధికారులు తొలగించారన్నారు. దీనిని ఆసరాగా చేసుకుని తమ నాయకుని విమర్శించడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అడవి సోమనపల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని 250 పైచిలుకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిన ఘనత మంత్రి శ్రీధర్ బాబుకే దక్కుతుందన్నారు. పుట్ట మధు భాష తీరు కారణంగానే మా పార్టీ నాయకులు విమర్శిస్తున్నారన్నారు. పుట్ట మధు భాష శైలిని, వ్యవహార శైలిని మార్చుకోకపోతే తగిన బుద్ధి చెబుతామన్నారు. మంత్రి శ్రీధర్ బాబు చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు ఆరవసారి సైతం అధిక మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి, కౌన్సిలర్ పెంటరి రాజు, పోలు శివ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోటికార్ కిషన్ జి, మంథని సురేష్, అజీమ్ ఖాన్, మాచిడి రవితేజ గౌడ్, ఎరుకల ప్రవీణ్, తోకల మల్లేష్, లైసెట్టి రాజు, శ్రీపతి బానయ్య, జంబోజు సమ్మయ్య లతో పాటు పలువురు పాల్గొన్నారు.



# కొండాపూర్ లో చేపల రకాలను తెలిపే ప్రదర్శన బోర్డు ఏర్పాటు

**ముస్తాబాద్ మే 9(జనంసాక్షి)**
ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామంలో ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పెద్ద చెరువు విస్తీర్ణం, చెరువులో లభించే చేపల రకాల వివరాలను తెలియజేసే ప్రదర్శన బోర్డును మత్స్య కారుల సంఘం ఏర్పాటు చేసింది. గ్రామ ప్రజలకు చెరువు ప్రాముఖ్యత పాటు చేపల పెంపకం, మత్స్య సంపాదనపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ బోర్డును ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బొందుకుల దేవి రెడ్డి, ఎరువు బాలరాజు, శంకర్ కరుణాకర్, నిర్వాహకులు ఉన్నారు

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం

## కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ జువ్వాడి నర్సింగరావు



**మల్లాపూర్ మే09 (జనంసాక్షి)**
అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం అని వెలమ కార్పొరేషన్ చైర్మన్. కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావుమండలం చిట్టాపూర్ గ్రామంలో శనివారం రోజున మూడు నూతన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నారు. నూతన గృహప్రవేశానికి వెల్లే లబ్ధిదారులకు ఆయన చీరలను అందజేశారు. ఇటీవల ఎన్నికైన వెల్మ కార్పొరేషన్ చైర్మన్ సందర్భంగా ఆయనను శాలువాలతో సన్మానించారు. వీరితో పాటు చిట్టాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బక్కురి చింతామణి, సర్పంచ్ శంకరమ్మ, ఉప సర్పంచ్ ప్రణయ్, మాజీ ఉపసర్పంచ్ గడ్డం లింగారెడ్డి, ఇప్పపెల్లి రాజేందర్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు..



# అక్రమ అరెస్టులతో గొంతు నొక్కలేరు

## ఏనుగు మనోహర్ రెడ్డి

**బోయిన్‌పల్లి, మే 09 (జనంసాక్షి)**
ప్రజా సమస్యలపై పోరాడే గొంతుకలను అక్రమ అరెస్టులతో అణిచివేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని స్తంభంపల్లిలో ఇటీవల జైలు నుంచి విడుదలైన బీఆర్ఎస్ నాయకుడు అక్కనపల్లి కరుణాకర్ను ఆయన పరామర్శించి, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ కేసులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని, ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి పోకడలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడిసె సదానందం, మేడుదల మల్లేశం, గుంటి శంకర్, కస్తూరి బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమంపై అవగాహన కార్యక్రమం

**ఇల్లంతకుంట,మే 09(జనం సాక్షి )**
రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామ చెరువు వద్ద రైతు వారోత్సవాలు నిర్వహించారు.సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు ఉపయోగపడే పలు అంశాలపై అవగాహన కల్పించారు.ముఖ్యంగాచెరువుల పరిరక్షణ, గ్రామాభివృద్ధి,వ్యవసాయానికి నీటి వనరుల ప్రాధాన్యతపై చర్చించారు. అలాగే చెరువులో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడం,చెరువు పూడిక సమస్యను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడం జరిగింది. కార్యక్రమంలో ఫిషరీ చైర్మన్ చొప్పరి రామచంద్రం,మత్స్య పారిశ్రామిక సంఘ సభ్యులు,ఇరిగేషన్ శాఖ ఏఈలు రాధిక,దిలీప్,సిబ్బంది పాల్గొన్నారు.అలాగే ఫీల్డ్ అసిస్టెంట్,ఉపాధి హామీ పనుల కూలీలు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

## జుక్కల్ నియోజకవర్గం ఓబిసి మోర్చ అధ్యక్షులు గోపి

**పిట్లం మే 09(జనం సాక్షి)**



హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో ఈ నెల 10 న నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి ఓబీసీ మోర్చ జుక్కల్ నియోజకవర్గం అధ్యక్షుడు బి గోపి పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి ఘన విజయం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు . ఈ బహిరంగ సభను ముఖ్యఅతిథిగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విచ్చేయుచున్న నేపథ్యంలో జుక్కల్ నియోజకవర్గం నుండి అన్ని గ్రామాల నుండి భారీ సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని దిశ నిర్దేశం చేశారు. 2029 సంవత్సరంలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో జుక్కల్ నియోజకవర్గం లో భారతీయ జనతా పార్టీ విజయ డంక మోగించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కళాశాలలో విద్య వారోత్సవాలు వేడుకలు

**ముత్తారం మే 09(జనంసాక్షి )**
ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 11 నుంచి 17,వరకు విద్యా వారోత్సవాలు నిర్వహించినట్లు శనివారం ముత్తారం కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ విద్యా వారోత్సవాలలో నూతన కళాశాల భవన ప్రారంభోత్సలు స్మృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు, దేశభక్తి గీతాలతో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తూ విద్య,క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేయడం తోపాటు కళాశాల అభివృద్ధి,ఉన్నత విద్యపై అవగాహన సదస్సు కలిపిస్తూ వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ కళాశాల విద్యార్థు.పాఠశాల వార్షికోత్సవం అనేది విద్యార్థుల, ఉపాధ్యాయుల కృషిని ప్రదర్శించడానికి, తల్లిదండ్రులను భాగస్వాములను చేయడం జరుగుతుందని ఒక ప్రకటనలో తెలిపారు.

# మహారాణా ప్రతాప్ విగ్రహ ఏర్పాటుకు కృషి

## అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా



**నిజామాబాద్ అర్బన్ మే 09 జనంసాక్షి :** ఇందూరు: నగరంలో మహారాణా ప్రతాప్ సింగ్ విగ్రహ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. మహారాణా ప్రతాప్ జయంతిని పురస్కరించుకొని నగరంలోని ఎల్లమ్మ గుట్ట చౌరస్తాలో ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చరిత్రలో అత్యంత ధైర్యవంతుడైన రాజుల్లో మహారాణా ప్రతాప్ ఒకరన్నారు. స్వామిమాణం దేశభక్తి ధైర్య సాహసాలకు ఆయన ప్రత్యేకగా నిలిచారని కొనియాడారు. మొగల్ చక్రవర్తి అక్బర్ ఆధిపత్యానికి ఎదురుగా నిలిచి స్వాతంత్రం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని తెలిపారు. ప్రధానంగా హల్దీ గాటి యుద్ధం ఆయన వీరత్వానికి గుర్తుగా నిలిచిందన్నారు. ఆయన రాజ్యం కోల్పోయిన ఆత్మగౌరవాన్ని కోల్పోలేదన్నారు శత్రువులకు తలవంచకుండా అడవుల్లో కష్టాలు పడుతూ జీవించాలని గుర్తు చేశారు. నేటి యువత మహారాణా ప్రతాప్ సింగ్ జీవిత నాదశంగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బొందిల రజక సంఘం అధ్యక్షుడు బొందిల బలరాం సింగ్, కార్యదర్శి నరేష్ సింగ్ కోశాధికారి మహేందర్ సింగ్, ఉపాధ్యక్షుడు తులసిరాం, విజయ్ సింగ్, రమేష్ సింగ్, లఖన్ సింగ్, బీజేపీ కార్పొరేటర్ మఠం పవన్, బంటు ప్రీతి ప్రవీణ్, నాయకులు పవన్ ముందడ, గోసేవ ప్రతినిధి ధాత్రిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అరుణోదయ రాష్ట్ర నాయకులు సంజీవ్ కు జోహార్లు



**నిజామాబాద్ సిటీ మే 09 జనంసాక్షి** అరుణోదయ రాష్ట్ర నాయకులు సంజీవ్ కురాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి దాసు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి , నివాళులు అర్పించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గాయత్రి నగర్ లో 13 మే 2026 సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాకు చెందిన తడకమల్ల సంజీవ్ ప్రమాదములో మరణించడం అరుణోదయకు తీరని లోటని ఆయన అభిప్రాయపడ్డారు.సూర్యాపేట జిల్లాలో అనేక ఆటా -పాట కార్యక్రమంలో అరుణోదయ సంజీవ్ పాల్గొన్నారని ఆయన తెలిపారు. గొసి కట్టి, గొంగలి భుజానవేసి, కార్మిక, రైతు, ప్రజా ఉద్యమ సభలలో తన ఆటపాటతో ప్రజల్ని ఆకట్టుకున్నారని ఆయన తెలిపారు. ప్రజా కళల కోసం అంటూ, తప్పుడు ధోరణులు ఆయన వ్యతిరేకించారనీ దాసు తెలిపారు. నిర్బంధాలను సైతం లెక్క చేయకుండా, అరుణోదయ అరుణ పతాకాన్ని చేత భూమి, సామాజిక మార్పు కోసం ఆయన కృషి చేశాడని దాసు తెలిపారు. నేడు కేంద్రంలో ఉన్న ప్రభుత్వం మతం పేరుతో, ప్రజలు విభజించు పాలించు విధానం నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తుందని ఆయన అన్నారు. కాషాయీకరణ పేరుతో, గోబెల్స్ ప్రచారం చేస్తుందని ఆయన తెలిపారు.ప్రజా ఉద్యమాలను తీవ్రం చేయడమే సంజీవపు నిజమైన నివాళి అని దాసు అన్నారు. నిజామాబాద్ జిల్లా అరుణోదయ జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్, గోపాల్, జిల్లా నాయకులు సుధాకర్, నతానియల్, కవిత భారతి, ప్రజా సంఘాల నాయకులు మల్లికార్జున్, మోహన్ ,దేవన్న, శంకర్, పోచన్న, పర్వన్నా, విటల్, ఈదుల గంగమని, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు భూసార పరీక్ష చేయించుకోవాలి: ఏవో కిషన్



**పెద్ద కొడప్గల్ మే 09 (జనంసాక్షి):** ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించు కోవాలని పెద్ద కొడప్గల్ మండల వ్యవసాయ శాఖ అధికారి కిషన్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజా పాలన సమావేశానికి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి రైతు కచ్చితంగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, దానికి అనుగుణంగానే ఫర్టిలైజర్ ఉపయోగించాలని సూచించారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు ఉపయోగించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఉన్నారు.



## పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వైష్ణవికి సన్మానం

**మల్లాపూర్ మే09 (జనంసాక్షి)**
మల్లాపూర్ మండల కేంద్రంలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ (542) కనబరిచిన గొట్టిపడత వైష్ణవి తండ్రి రమేష్ విద్యార్థినికి గౌడ సంఘం తరఫున సన్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సొసైటీ అధ్యక్షులు ముద్దం శరత్ గౌడ్ రేణుక ఎల్లమ్మ కమిటీ అధ్యక్షులు బండి లింగస్వామి గౌడ్ సభ్యులు సత్యం గౌడ్ సుదర్శన్ గోపగోని రాజ గౌడ్ ముద్దం శ్రీధర్ బండి భూమన్న గొట్టిపడుతున్నారాయన రాకేష్ వినోద్ జైపాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## తబితా ఆశ్రమంలో అన్నదానం..

**అంతర్గాం, జనంసాక్షి:**
మాదిరెడ్డి ఇందుమతి-భాస్కర్‌రావు ట్రస్ట్ వ్యవస్థాపకులు స్వర్గీయ మాదిరెడ్డి నాగరాజు కుమార్తె కావ్య పుట్టిన రోజు సందర్భంగా శనివారం రామగుండంలోని తబితా ఆశ్రమంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. మాదిరెడ్డి ఇందుమతి-భాస్కర్‌రావు ట్రస్ట్ ఎంతో మంది పేదలకు, నిరాశ్రయులకు, అనాథలకు అండగా నిలిచిందని,స్వర్గీయ మాదిరెడ్డి నాగరాజు వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని కుటుంబ సభ్యుల సహకారంతో గోదావరిఖని, హైదరాబాద్,ఇతర ప్రాంతాలలో ట్రస్ట్ ద్వారా సేవలందించిడం హర్షణీయం అని దినేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తబితా ఆశ్రమ నిర్వాహకులు వీరేంద్రనాయక్, విమల, ఆశ్రమ పిల్లలు పాల్గొన్నారు.

## రిఫ్రిజిరేటర్ ను అందిస్తున్న కమాండెంట్ రాందాస్



**ముస్తాబాద్ మే 9 (జనంసాక్షి)**
స్వార్థం లేకుండా సమాజం కోసం పనిచేసే వారికి చేతనైనంత చేయూత రూపొందించాలని సర్దాపూర్ 17వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ కమాండెంట్ రాందాస్ పేర్కొన్నారు. మండలంలోని గూడెం అన్నపూర్ణ ఫౌండేషన్ కు రిఫ్రిజిరేటర్ అందించారు. కూరగాయలు నిల్వ చేసుకోవడం కోసం ఎంతగానో ఉపయోగపడుతుందని అందించినట్లు తెలిపారు. అన్నపూర్ణ ఫౌండేషన్ నిర్వాహకులు కూర సావిత్రి, బొప్ప విజయ, దేవేందర్ పరుశురాములు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఏ ఈ ఆధారిత వాట్సాప్ చాట్‌బాట్ సేవలు

# ప్రారంభించిన టీజీఎన్‌పీడీసీఎల్

### తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో 247 విద్యుత్ సేవలు

### బిల్లు, ఫిర్యాదులు, అంతరాయ సమాచారం సెకన్లలో

**కరీంనగర్ టౌన్ మే 9 ( జనంసాక్షి)**
టీజీఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో వినియోగదారులకు మరింత వేగవంతమైన, పారదర్శక సేవలు అందించేందుకు కృత్రిమ మేధ ఆధారిత వాట్సాప్ చాట్‌బాట్ సేవలను ప్రారంభించినట్లు కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాపెల్లి రవీందర్ తెలిపారు. మే 8, 2026 నుండి ఈ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు వెల్లడించారు.
18 జిల్లాల్లోని 70.39 లక్షల మంది వినియోగదారులకు ఈ చాట్‌బాట్ ద్వారా సేవలు అందించనున్నట్లు తెలిపారు. వినియోగదారులు తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో తమ స్వంత మాటల్లో సందేశాలు పంపితే, ఏ ఐ సాంకేతికత ద్వారా ప్రశ్నలను అర్థం చేసుకుని తగిన సమాచారం అందిస్తుందని పేర్కొన్నారు. వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా వినియోగదారులు బిల్లు విచారణ, చెల్లింపు స్థితి, ఫిర్యాదు నమోదు, ఫిర్యాదు టికెట్ స్థితి, విద్యుత్ అంతరాయ సమాచారం వంటి సేవలను పొందవచ్చన్నారు. చాట్‌బాట్ సమాధానం ఇవ్వలేని సమస్యలు వచ్చినప్పుడు నేరుగా హెల్ప్‌లైన్ ఏజెంట్‌కు కనెక్ట్ చేసే సదుపాయం కూడా కల్పించినట్లు తెలిపారు.రైతులకు సైతం సులభంగా అర్థమయ్యేలా తెలుగు భాషలో ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని ఎస్‌ఈ తెలిపారు. కాల్ వెయిటింగ్, ఏజెంట్ క్యూ లేకుండా సెకన్లలో సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. వినియోగదారులు తమ మొబైల్‌లో 8712481489 నంబర్‌ను వాట్సాప్‌లో సేవ్ చేసుకుని సేవలను పొందవచ్చన్నారు. అలాగే నేరుగా సేవలను ఉపయోగించేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ వాట్సాప్ యాప్ చాట్ బాట్ లింక్‌ను ఉపయోగించవచ్చని సూచించారు. ఇంట్లోనే కూర్చుని విద్యుత్ సేవలను సులభంగా పొందేందుకు ఈ చాట్‌బాట్‌ను వినియోగించుకోవాలని వినియోగదారులకు ఎస్‌ఈ రాపెల్లి రవీందర్ విజ్ఞప్తి చేశారు.

## కల్లుగీత కార్మిక సహకార కార్పొరేషన్ చైర్మన్ కి సన్మానం



**నిజామాబాద్ సిటీ మే 09 జనంసాక్షి :**
రాష్ట్ర కల్లుగీత కార్మిక సహకార కార్పొరేషన్ చైర్మన్ గా నూతనంగా ఎంపికైన చంద్రశేఖర్ గౌ డ్ ను రూరల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిన్నారెడ్డి సంతోష్ రెడ్డి, మోపాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సాయ రెడ్డి శేఖర్ గౌడ్ స్వగృహంలో ఆయనను శాలువాతో సన్మానించి మునుముందు శేఖర్ గౌడ్ మరిన్ని పదవులు ఆశించాలని కోరుకుంటూ ఆయనకు శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని అలాగే తనకు పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డికి, షబ్బీర్ అలీ కి రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



## వైభవంగా హనుమాన్ రథయాత్ర

**మంథని, (జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలో శ్రీ హనుమాన్ సేవా సమితి వారి ఆధ్వర్యంలో శనివారం హనుమాన్ దీక్ష విరమణ రథయాత్ర నిర్వహించడం జరిగింది. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా శ్రీ హనుమాన్ సేవ సమితి హనుమాన్ రథయాత్ర మాల ధారణ స్వాములతో కమాన్ పూర్ పురవీధుల గుండా చాలా అందంగా తయారు చేసిన రథంలో స్వామివారి విగ్రహాలతో ఊరేగింపుగా తిరుగుతూ రామనామ జపంతో కాలినడకన పాదయాత్ర చేస్తూ, డిజె సప్పులతో మార్మోగుతూ ఉత్సాహంగా జైశ్రీరామ్ జై హనుమాన్ అనే నినాదాలతో గ్రామము మార్మోగింది. ఈ కార్యక్రమంలో హనుమాన్ సేవ సమితి గౌరవ అధ్యక్షులు చిర్రసత్యం అధ్యక్షులు సుద్దాల కృష్ణమూర్తి ,పిన్ రెడ్డి కిషన్ రెడ్డి జంగపల్లి అజయ్, సుతారి రాజేందర్, పొన్నం రాజు, బుర్ర రాజు, జంగపల్లి చిన్న శ్రీనివాస్, పలిగిరి చందర్, దేవునూరి చంద్రమౌళి, మట్ట మల్లేష్, మెట్టు సాంబ మూర్తి, సుర భాస్కర్ ,చెన్నూజో చంద్రశేఖర్, కమ్మగాని అనిల్, జంగ పల్లి నాగరాజు, కాడిపల్లి సుమన్ తుండ్ల శ్రీనివాస్, కుక్క మహేష్, కోరే శ్రీనివాస్, రెడ్డి చైతన్య, పోతుల ప్రకాష్ , మెరుగు దుర్గయ్య, దొనికన విజయ్, మల్యాల అంజి, కాం పెల్లి తిరుపతి, కీర్తి సాయి హనుమాన్ స్వాములు హిందూ బంధువులు పాల్గొన్నారు.